ప్రజాశక్తి
శనివారం 19 అక్టోబరు 2024
5
శ్రీకాకుళం

విద్యార్థిని ఆత్మహత్యపై నివేదిక అందించాలి

ప్రజాశక్తి - పాతపట్నం

పాతపట్నంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏడో తరగతి విద్యార్థిని హాస్టల్ గదిలో జడ రిబ్బనుతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై జిల్లా విద్యాశాఖ, ఐటిడిఎ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలకు చేరుకున్న విద్యార్థిని మృతికి కుటుంబ సభ్యుల ఒత్తిడి గానీ ఉపాధ్యాయుల వేధింపులు గానీ ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా దిశగా విచారణ చేపట్టాలని సూచించారు. అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చర్యలకు ఉపక్రమించనున్నట్లు పేర్కొన్నారు.

కొత్త సీసాలో పాత సారా

- సరుకు, ధరలు పాతవే
- షాపులకు పూర్తిస్థాయిలో సరఫరా కాని మద్యం
- ఇప్పటికీ తెరుచుకోని 19 దుకాణాలు
- మూడు రోజుల్లో రూ.28.36 కోట్ల విక్రయాలు

మద్యం పాలసీ కొత్తదే అయినా మందుబాబులకు ఊరట లభించలేదు. ఇంకా పాత ధరలకే మద్యాన్ని అమ్ముతున్న పరిస్థితి నెలకొంది. కొత్త బ్రాండ్లు అందుబాటులోకి రాకపోవడం మద్యం ప్రియులను నిరాశపరుస్తోంది. నూతన మద్యం పాలసీలో నాణ్యమైన మద్యం బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ధరలను తగ్గిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా అమలు కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఈనెల 16వ తేదీ నుంచి దుకాణాలు ఏర్పాటైనా, పూర్తిస్థాయిలో నూతన వ్యవస్థ గాడిన పడలేదు. షాపులకు సరుకు పంపిణీ, కొత్త దుకాణాల ఏర్పాటులో సమస్యలు వెంటాడుతున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు భావిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఆమదాలవలస, ఎచ్చెర్ల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాల్లో పాత విధానాన్ని రద్దు చేసి ప్రయివేట్ మద్యం విధానం తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే. జిల్లాలోని 158 మద్యం దుకాణాలకు ఈనెల 14వ తేదీన లాటరీ నిర్వహించి లైసెన్స్‌లను జారీ చేసిన సంగతి తెలిసిందే. లైసెన్స్ దక్కించుకున్న వారి దుకాణాలు ఏర్పాటుకు షాపులు దొరక్కపోవడంతో ఇప్పటికీ పూర్తిస్థాయిలో షాపులు తెరుచుకోలేదు. ఇప్పటివరకు 19 దుకాణాలు ఏర్పాటు కాలేదు. వ్యాపారం బాగా జరిగే అవకాశాలు ఉన్న చోట దుకాణాల అద్దెలు ఎక్కువగా చెప్తుండటంతో వ్యాపారులు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మరోచోట షాపులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. కొన్ని దుకాణాలకు మద్యం సరఫరాలో సాంకేతిక సమస్యలు లేవనెత్తడం వల్ల కూడా ప్రారంభానికి నోచుకోలేదని సమాచారం. వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసినా, వారికీ పూర్తిస్థాయిలో మద్యం సరఫరా కావడం లేదనేది తెలుస్తోంది. మద్యం అమ్మకాలను ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అమ్ముకునే అవకాశం ఉన్నా సరుకు లేకపోవడంతో రాత్రి ఏడు, ఎనిమిది గంటల కల్లా మూసివేస్తున్నారు. ఉదయం పూట 12 గంటల తర్వాతే మద్యం అమ్మకాలు మొదలవుతున్నాయి. జిల్లాలో ఈనెల 16 నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటైన తర్వాత 31,849 కేసుల లిక్కరు, 8,28,939 కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.28 కోట్ల 26 లక్షల 46 వేల 740 ఆదాయం సమకూరింది.

తగ్గని మద్యం ధరలు

నూతన మద్యం విధానం అమలుతో ధరలు తగ్గుతాయని మందుబాబు ఆశపడ్డారు. అయితే ప్రైవేట్ మద్యం దుకాణాల్లో యధావిధిగా అధిక ధరలకే మద్యాన్ని విక్రయిస్తున్నారు. కొత్త దుకాణాల వద్దకు వెళ్లిన మందుబాబులు ధరలు తగ్గకపోవడంతో షాపుల నిర్వాహకులతో వాగ్వాదానికి దిగుతున్నారు. పేరుకే కొత్త దుకాణాలని, ధరలు ఏ మాత్రం తగ్గలేదని మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. చీప్ లిక్కరును రూ.99కే అని ప్రభుత్వం ప్రకటించినా రూ.130కే అమ్ముతున్నారు.

దుకాణాల ఏర్పాటుపై తేలని పంచాయితీ

మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో కొన్నిచోట్ల పంచాయతీ తేలకపోవడంతో పూర్తిస్థాయిలో దుకాణాలు ఏర్పాటు కాలేదని తెలుస్తోంది. టిడిపి చెందిన గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కొన్నిచోట్ల దుకాణాలు దక్కించుకున్నా వారు అనుకున్న చోట షాపులను పెట్టుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. వ్యాపారం బాగా జరిగే ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు టిడిపి పెద్ద నాయకులు పోటీ పడుతుండటంతో ఆగినట్లు తెలుస్తోంది. టెక్కలి నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఎక్కువగా సమాచారం.

మద్యం బ్రాండ్లపై అసంతృప్తి

మద్యం బ్రాండ్లపైనా మందుబాబులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రకాల బ్రాండ్లు నాసిరకంగా ఉన్నాయని మండిపడుతున్నారు. లిక్కరు షాపులకు కొన్ని బ్రాండ్లు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. వాటిలో బూమ్‌బూమ్ బీరు, నెపోలియన్ బ్రాందీ, మాన్షన్ హౌస్ బ్రాందీ, ఎలిఫెంట్ బీరు, మెక్‌డొల్ విస్కీ, రాయల్ గ్రేట్, క్లాసిక్ రెడ్, కింగ్ ఫిషర్ బీరు, వంటి పాత బ్రాండ్లే ఎక్కువగా దొరకుతున్నాయని మద్యం ప్రియులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమూ పాత ధరలకే అమ్ముతోందని గగ్గోలు పెడుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రబీకి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు

సిద్ధం చేయాలని డీలర్లకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డీలర్లకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లాలోని ఎరువులు, విత్తనాల హోల్‌సేల్ డీలర్లు, ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పలువురు డీలర్లపై జరిమానాలు విధించినట్లు తెలిపారు. నాణ్యమైన విత్తనాలను, ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆయా కంపెనీదారులను ఆదేశించారు. రానున్న సీజన్‌లో 77,176 హెక్టార్లలో రబీకి సాధారణ సాగు విస్తీర్ణం అంచనా వేసినట్లు తెలిపారు. ఇందుకుగానూ 40,225 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంటుందని గుర్తించామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 9,793 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అత్యధికంగా 29,930 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి, జిల్లా కోపరేటివ్ అధికారి బి.నగేష్, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రమణి, హోల్‌సేల్ ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వైశ్యరాజు గోవిందరాజు, పొట్నూరు శ్రీరాములు, బోయిన గోపాల్, వ్యవసాయశాఖ ఎడిలు, పలు ఎరువుల కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌కు చేతన్, త్రిలోచన్ ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : ఈనెల 19, 20 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో నగరంలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి శిష్టు లక్ష్మీచేతన్, అండర్-14 విభాగంలో నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థి మల్లారెడ్డి త్రిలోచన వెంకట సాయిప్రసాద్ ఎంపికయ్యారు. నగరంలోని మాతృదేవోభవ రైఫిల్ షూటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వీరు శిక్షణ పొందుతున్నారని శిక్షకుడు పిల్లల తిరుమల హరీష్ కుమార్ తెలిపారు. రైఫిల్ షూటింగ్ పోటీలకు వెళ్లనున్న చేతన్, త్రిలోచన్‌ను ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి రమణ, న్యూ సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్ పి.శ్రీకాంత్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు. రైఫిల్ షూటింగ్‌లో జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

హామీలను అమలు చేయాలి

రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు

ప్రజాశక్తి - పలాస

సార్వత్రిక ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీడి రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించి, జీడి అభివృద్ధి బోర్డు, జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలు కావస్తున్నా జీడి రైతులకు ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. హామీల అమలు కోరుతూ పలాస, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బెందాళం అశోక్‌కు వినతిపత్రాలు అందజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పలుమార్లు ప్రకటనలు చేయడం తప్ప అమలుకు చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించి, జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీడిపిక్కలను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. జీడి అభివృద్ధి బోర్డు, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆరు పంటలకు మద్దతు ధర ప్రకటించిందని, జిల్లాలో లక్ష మందికి పైగా ఆధారపడి ఉన్న జీడి పంటకు మాత్రం మద్దతు ధర ప్రకటించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరల జాబితాలో జీడి పంటను చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జీడి రైతుల సంఘం నాయకులు తమ్మినాన భాస్కరరావు, ఆర్లి దానేష్, మడ్డు రాఘవరావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ కుమార్

సిక్కోలు సంబరాలకు సన్నద్ధం

- ఆర్అండ్‌బి మైదానంలో దీపావళి సంబరాలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సిక్కోలు జిల్లా ఖ్యాతిని చాటేలే సిక్కోలు సంబరాలను నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి మైదానంలో ఈనెల 31న దీపావళి సంబరాలు నిర్వహించాలన్నారు. ఈ వేడుకలను శ్రీకాకుళం ఆర్‌డిఒ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, పర్యాటక శాఖ అధికారి సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో సిక్కోలు సంబరాలు, ఫుడ్ ఫెస్టివల్ వంటి వేడుకలను నిర్వహించేందుకు సమాయత్తం కావాలని సూచించారు. ఈ వేడుకలను రెండు, మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రజల్లో స్పందన ఆధారంగా పొడిగింపు ఉంటుందన్నారు. జిల్లాలోని టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని, సర్క్యూట్‌లో బస్సులు నడపాలని సూచించారు. పెద్దపాడు చెరువును అభివృద్ధి చేయాలన్నారు. కాఫీ టేబుల్ బుక్ తయారు చేయాలని ఆర్‌డిఒను ఆదేశించారు. విజయాదిత్య సాగర్ పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, వజ్రపుకొత్తూరు మండలంలోని శివసాగర్ బీచ్ వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హిరమండలం రిజర్వాయరులో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు చీఫ్ ఇంజినీరు నుంచి అనుమతి కోరినట్లు పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక బీచ్ వద్ద ఐలాండ్, మెట్టూరులోని ఒంకులూరు బీచ్‌లో ఎర్రమట్టి దిబ్బలు, ఇతర ప్రాజెక్టులు, గ్రామీణ పర్యాటకం తదితర వాటిపై చర్చించారు. సమావేశంలో వంశధార డిఇఇ సురేష్ కుమార్, పర్యాటకశాఖ అధికారి నారాయణరావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, పర్యాటక శాఖ ఎఇ మదన్ మోహన్, హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.నాగరాజు, ట్రావెల్ ఏజన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బంగారం బిస్కెట్ల పేరిట కుచ్చుటోపీ

- రూ.కోటి వరకు కాజేసిన కి'లేడీ'
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి - నౌపడ

నగదు ఇచ్చినట్లు ఆధారాలు చూపిస్తున్న మహిళలు

దేవి

సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన దుక్కా దేవి బంగారు బిస్కెట్ల ఆశ చూపి కుచ్చుటోపీ పెట్టింది. మాటల గారడీతో బాధితులను బుట్టలో వేసుకొని తులం బంగారం నగదు చెల్లిస్తే, రెండు తులాల బంగారం ఇస్తామని ఆశ చూపి రూ.కోటి వరకు కొల్లగొట్టింది. లక్షల్లో నగదు చెల్లించి ఏడాది గడిచినా బంగారం లేక, నగదూ రాక తాము మోసపోయామని బాధితులు లబోదిబోమంటున్నారు. కొన్నాళ్ల కిందట ఈ తతంగం జరిగినా అప్పటి అధికార వైసిపి నాయకుల అండదండలతో విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. వివరాల్లోకి వెళ్తే చౌక ధరకు బంగారు బిస్కెట్లు, బంగారు ప్రతిమలు ఇప్పిస్తామని నౌపడ, టెక్కలి, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు చెందిన మహిళల నుంచి దేవి భారీగా వసూళ్లకు పాల్పడింది. బ్యాంకులో తన భర్త పనిచేస్తున్నాడని, హైదరాబాద్‌లోని బ్యాంకు వేలంలో బంగారు బిస్కెట్లు గతంలో పాడుకున్నానని నమ్మించింది. డబ్బుల అవసరం ఉందని, అందుకే కేజీ బిస్కెట్లు రూ.10 లక్షలు చొప్పున అమ్మేస్తున్నట్లు పదుల సంఖ్యలో మహిళలను నమ్మించింది. నౌపడకు చెందిన కె.భాగ్యలక్ష్మి నుంచి రూ.35 లక్షలు, బేబీ నుంచి రూ.20 లక్షలు, హైదరాబాద్ చెందిన ఒక మహిళ నుంచి రూ.25 లక్షలు, టెక్కలికి చెందిన పైల దమయంతి నుంచి రూ.37లక్షలు, మరికొందరి నుంచి రూ.50 వేలు మొదలు రూ.మూడు లక్షల వరకు అప్పులు చేసి మరీ ఆమెకు సమర్పించుకున్నారు. కొంతమంది పాత బంగారం కూడా ఆమెకే ఇచ్చేశారు. నగదు లావాదేవీలకు సంబంధించిన ఫోన్ పే, గూగుల్ పే, బ్యాంకు రశీదు వంటి ఆధారాలు బాధిత మహిళల వద్ద ఉన్నాయి. నగదు ఇచ్చినట్లు అగ్రిమెంట్లు కూడా ఉన్నాయి. కొన్నాళ్ల తర్వాత బంగారు బిస్కెట్లు ఇవ్వకపోవడంతో బాధిత మహిళలు ఆమెను నిలదీశారు. ఇస్తానంటూ వాయిదాలు వేసుకుంటూ రావడంతో మోసపోయామని గ్రహించారు. అప్పటి అధికార వైసిపి నాయకుల వద్ద పంచాయితీ పెట్టగా, వారు రాజీ కుదర్చడానికి పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. పలుకుబడి ఉన్న ఇద్దరు, ముగ్గురు ఆమె వద్ద నుంచి నగదు తీసుకున్నా మిగతా మహిళలు డబ్బులు రాబట్టుకోలేక బాధితులుగానే మిగిలిపోయారు. తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక గ్రామంలోని టిడిపి నాయకులు, మీడియాను శుక్రవారం ఆశ్రయించారు. పోలీసులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

బాధితులకు ఆశ చూపిన బంగారు బిస్కెట్లు

సమస్యలు ఉంటే సంప్రదించండి

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలీసు సిబ్బంది వ్యక్తిగత, ఆరోగ్య, ఉద్యోగరీత్యా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలని, ఆయా సమస్యలపై సాధ్యాసాధ్యాల బట్టి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో పోలీస్ కమ్యూనిటీ హాల్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా పోలీస్ గ్రీవెన్స్ డేను శుక్రవారం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఉద్యోగ, వ్యక్తిగత, అనారోగ్య సమస్యలను ఎస్‌పికి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సిబ్బందికి ఎటువంటి సమస్య ఉన్నా నిర్భయంగా నిర్భయంగా చెప్పవచ్చున్నారు. అత్యవసరమైనప్పుడు ఫోన్‌లో అయినా సమస్యలను చెప్తే, పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా కల్పించారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని మానసిక, శారీరకంగా దృఢంగా ఉండి ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. పలు ముఖ్యమైన అంశాలపై ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

'స్వాభిమాన్'కు 31 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఏడాదిన్నర కాలంగా వికలాంగుల బ్యాక్‌ల్యాగ్ పోస్టులను భర్తీ చేయడం లేదని, దీనివల్ల నిరుద్యోగులైన వికలాంగులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన పైడి నర్సింగరావు కోరారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, వికలాంగుల శాఖ ఎడి కవిత వినతులను స్వీకరించారు. గ్రీవెన్స్‌కు జిల్లావ్యాప్తంగా 31 వినతులు వచ్చాయి. సంతబొమ్మాళి మండలం హెచ్.ఎన్ పేటకు చెందిన కోళ్ల రమేష్ తాను ఎంసిఎ పూర్తి చేశానని, ఉద్యోగావకాశం కల్పించాలని వినతిపత్రాన్ని అందజేశాడు. పోలాకి మండలం ముప్పిడికి చెందిన ఆదిలక్ష్మి తనకు ఉపాధి కల్పించాలని కోరారు. మందస మండలం సొండిపూడికి చెందిన ఈశ్వరరావు తాను డిగ్రీ వరకు చదువుకున్నానని, ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. అదే మండలం కుంటికోట కాలనీకి చెందిన నెయ్యిల రమేష్ తన కుమారునికి చేతివేళ్లు లేవని సదరం సర్టిఫికేట్‌ను జారీ చేయాలని కోరారు. సారవకోట మండలం అలుదుకు చెందిన సిహెచ్.మోహనరావు తన కుమారునికి వంద శాతం వికలాంగుడైనా ప్రభుత్వం నుంచి రూ.ఆరు వేలు పెన్షన్ మాత్రమే అందుతోందని, రూ.15వేలు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని కోరాడు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, రిమ్స్ సూపరిండెండెంట్ షకీలా, డిసిహెచ్ఎస్ కళ్యాణ్‌బాబు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ శాంతి శ్రీ, డ్వామా పీడీ బి.సుధాకర్ , డిపిఒ కె.భారతీసౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి ఉద్యోగాలకు...

మెరిట్ జాబితా విడుదల

20లోగా అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో కాంట్రాక్టు టీచింగ్, అవుట్‌సోర్సింగ్, నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలపై అభ్యంతరాలను ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని పేర్కొన్నారు. https://apkgbv.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా https://sites.google.com/site/deosklorg సబ్జెక్టుల వారీగా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థుల మెరిట్ జాబితాలో ఉన్న వివరాలు, మార్కులు పరిశీలించి అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 21న అన్ని ఒరిజనల్ సర్టిఫికేట్లతో పాటు ఒక జత జిరాక్స్ సెట్స్ తీసుకొని కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

మద్యం దుకాణం వద్దు

చిలకపాలెంలో రోడ్డెక్కిన స్థానికులు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

స్థానికులకు నచ్చజెప్తున్న ఎక్సైజ్ సిఐ గోపాలకృష్ణ

మండలంలోని చిలకపాలెంలో మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానికులు భగ్గుమన్నారు. చిలకపాలెం గ్రామంలోని మునివీధిలో షిర్డీసాయి ఆలయానికి సమీపాన కొత్తగా మద్యం షాపును వ్యాపారులు ప్రారంబించారు. శుక్రవారం నుంచి అమ్మకాలు ప్రారంభించడంతో స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం వద్దే వద్దని కరాఖండిగా చెప్పారు. మద్యం వ్యాపారి వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించినా వారు వినిపించుకోకుండా నిరసనను కొనసాగించారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సిఐ గోపాలకృష్ణ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఆయన సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు మద్యం దుకాణాన్ని ఆ ప్రదేశం నుంచి తొలగించడానికి అంగీకరిస్తూ వ్యాపారి సమక్షంలో స్పష్టమైన హామీ ఇవ్వడంతో స్థానికులు నిరసనను విరమించారు. నిరసనలో స్థానికులు రమణమ్మ, సూరిబాబు, విశ్వేశ్వరరావు, సురేష్, జయశ్రీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత మండలాలకు ప్రత్యేక అధికారులు

శ్రీకాకుళం : తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలకు ప్రత్యేక పర్యవేక్షక అధికారులను నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అదేశాలు జారీ చేశారు. రణస్థలానికి డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్ (8008803800), ఎచ్చెర్లకు డ్వామా పీడీ, బి.సుధాకరరావు (8790008399), శ్రీకాకుళంకు డిపిఒ కె.భారతి సౌజన్య (8341493877), గారకు ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ (9440814582), పోలాకికి జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా (9100997770), సంతబొమ్మాళికి పరిశ్రమల శాఖ జిఎం ఉమామహేశ్వరరావు (9866530885), వజ్రపు కొత్తూరుకు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వి శ్రీనివాస రావు (9440716028), సోంపేటకు అజయ్ కార్తికేయ (9492555034), మందసకు పి.చంద్రశేఖర్ (9492416700), కవిటికి ఆర్.వి ప్రసాద్ (7995086758), ఇచ్ఛాపురానికి సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి (6309998070)ని నియమించారు.

PASSPORT MISSING

I, TAMADA HEMARAJU, S/o. RAMASWAMY, aged about 33 years, R/o DOOR No. 1-27, Manchinuthi Street, Karthalipalem village, Palavalasa (PO), Sompeta Mandal, Srikakulam Dist, AP.

My passport number B8132795 , I was traveling on Bike from Karthalipalem to Korlam for taking Xerox copies and inspite of my best efforts I am unable to trace it and it is lost beyond recovery. That I am in need for a duplicate passport for which purpose I am hereby making this declaration as required by the Concerned Authorities. The above facts are true and correct to the best of my knowledge and belief.

Phone number: 8919062243

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ తదితరులు

సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఇరపాడుపురం సర్పంచ్ ఎస్.గౌరీస్‌పై స్థానిక ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు గ్రామస్తులతో శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పంచాయతీ సభ్యులకు తెలియకుండా తీర్మానం చేసి పంచాయతీ నిధులు అవకతవకలకు పాల్పడ్డారని, పోడు పట్టాలకు అక్రమ వసూలు చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిహెచ్ లక్ష్మి, వార్డు మెంబర్లు ఎం.జయమ్మ, రామారావు, ఎస్.ప్రకాష్, ప్రభా, చందర్రావు, గొడ్డ తలాబీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సిహెచ్‌సి సూపరింటెండెంట్ డా.కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ సిహెచ్‌సిలో గత ఎనిమిదేళ్లుగా వివిధ విభాగాల్లో పారామెడికల్ సిబ్బంది 8మంది పని చేస్తున్నారన్నారు. చట్ట ప్రకారం కనీస వేతనం నెలకు రూ.16 వేలు చెల్లించాల్సి ఉండగా, వారాంతపు సెలవులు అమలు చేయాలని, నేటికీ ఇవేవీ అమలు కావడం లేదని, ఎటువంటి కార్మిక చట్టాలు అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని, పనిభారానికి తగ్గట్టు కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు విజయ కుమారి, లక్ష్మి, మాలతి, వెంకటేష్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ

టెక్కలి: పట్టణంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహం, సాంఘీక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాలను సీనియర్ సివిల్ జడ్జి జె. శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. వసతి గృహాల స్థితిగతులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, వైద్య విధానం, గదులను, వంట గదులను, పిల్లలకు ఇస్తున్న ఆహార పదార్థాలను ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం ఇస్తున్నారా లేదా అన్న విషయంపై ఆరా తీశారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

మెళియాపుట్టి : భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని సంత లక్ష్మీపురం, గొప్పిలి, వసుంధర తదితర ప్రాంతాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు, మాజీ ఎఎంసి చైర్మన్ అనపాన రాజశేఖర్ సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ గణేష్, ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణ, సలాన వినోద్, సంబాల వెంకటరావు, బమ్మిడి భాస్కరరావు, చామంతి, జగన్నాథం, హనుమంతు చంద్రశేఖర్, విష్ణు ప్రసాద్ పాండా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు టిడిపి నాయకులు మణిచంద్ర ప్రకాష్, పొందర కృష్ణారావు, బెందాలం రమేష్ తెలిపారు. మండలం బెజ్జిపుట్టుగలో శుక్రవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.22 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాసుదేవ్ రౌలో, రంగా రౌలో, బార్ల చిన్నబాబు, బాసుదేవ్ ప్రధాన్, పుల్లట సంతోష్, బెందాళం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని కొత్తకోట పంచాయతీలో సర్పంచ్ సురవరపు జగదీష్ అధ్యక్షతన సిసి రహదారుల నిర్మాణాలకు ఎంపిడిఒ ఎం.పావని, రాష్ట్ర టిడిపి కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు అంబళ్ల రాంబాబు భూమిపూజ చేపట్టారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు టి.వి.రమణ, ఎల్.పూర్ణారావు, వెంకట రావు, ఇఒపిఆర్‌డి బి.రామారావు, ఎపిఎం గోవిందరాజులు, ఎపిఒ బి.పార్వతి పాల్గొన్నారు.

అలాగే మండలంలోని తొగరాం, కలివరంలో కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు నాటారు. టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, శ్రీరామ్మూర్తి, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఇసి గట్టి రాము, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం లఖందిడ్డి పంచాయతీలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఆర్‌జిఇఎస్ నిధులతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె. ఫణీంద్రకుమార్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, టిడిపి నాయకులు కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం యలమంచిలి పంచాయతీలో మాజీ సర్పంచ్ రోణంకి లీలామోహన్ ఆధ్వర్యంలో సిసిరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మెట్ట

కోటబొమ్మాళి : పనులకు శంకుస్థాపన చేస్తున్న టిడిపి నాయకులు

కవిటి : సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

మన్మధరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలాస : మండలం కేదారిపురం, పెదంచల, తర్లకోట పంచాయతీల్లో శుక్రవారం సిసి రోడ్ల నిర్మాణానికి టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వసంతరావు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని మాకవరం, కుద్దిగాం, పొన్నుటూరులో రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, టిడిపి నాయకులు మాతల గాంధీ, తాతబాబు, అరుణ్ కుమార్, మధవరావు, పి.మోహనరావు, పి.వెంకట కృష్ణ, ఎంపిడిఒ నీరజ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం తాడివలస పంచాయతీ లచ్చయ్యపేటలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిసి రహదారి నిర్మాణానికి సర్పంచ్ తమ్మినైన మణెమ్మ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మీసాల మన్మధరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, ఉప సర్పంచ్ చలపతిరావు, పంచాయతీ రాజ్ జెఇ గుప్త, ఎపిఒ శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఇన్‌ఛార్జికి బెదిరింపులు

ప్రజా ఫిర్యాదుల వేదికలో ఎస్‌పికి ఫిర్యాదు

ఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త డాక్టర్ వేగులాడ దుర్గారావుకు కొంతమంది ఆకతాయిలు వాట్సప్ ద్వారా ఫోన్ చేసి తీవ్రమైన పదజాలంతో బెదిరింపులకు పాల్పడ్డారని జనసైనికులు నియోజకవర్గంలో మూడు మండలాల్లో పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అయితే శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి గ్రీవెన్స్ నిర్వహించడంతో జిల్లా సంయుక్త కార్యదర్శి లావేటి సురేష్ కుమార్, కోన కృష్ణారావు తదితరులు ఎస్‌పి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

గ్రీవెన్స్‌కు 11 వినతులు

ఎస్‌పి నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 11 వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను విని, సానుకూలంగా స్పందించారు. తక్షణమే ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ అంశాలపై 1, కుటుంబ కలహాలపై 1, పాత ఫిర్యాదులపై 1, పరిపాలన అంశాలపై 2, ఇతరత్రా అంశాలపై 6 ఫిర్యాదులు వచ్చాయి.

నైపుణ్యం పెంచేందుకే శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే శిక్షణను అందిస్తున్నట్టు జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు సూర రామచంద్రరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి శిక్షణలను జిల్లాలో తొమ్మిది ప్రాంతాల్లో శాశ్వతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలను వినియోగించుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ప్రతినిధులు మునగ వలస రవీంద్రబాబు, డాక్టర్ పి. తాతయ్యలు, సాయికృష్ణ, ఎస్.వాసు, టి. బంగార్రాజు, ధర్మారావు, ప్రతిమ, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం : సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ

ప్రణాళికతో బోధించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో శుక్రవారం జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో టెక్కలి డిప్యూటీ డిఇఒ సి.విలియం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా వ్యవస్థలో మారుతున్న పరిణామాలు, కార్యక్రమాలను ఉద్దేశించి దిశా నిర్దేశం చేశారు. అపార్ యూడైస్ విద్యార్థుల ప్రొఫైల్‌కి సంబంధించి ఎడిట్‌ని ఎలా చేయాలో తెలియజేశారు. 10వ తరగతి విద్యార్థుల ఫలితాలు, స్లో లెర్నర్స్ కోసం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎస్.దేవేంద్రరావు, పద్మనాభరావు, హెచ్‌ఎంలు, సిఆర్‌ఎంటిలు, సిబ్బంది పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలో పాఠశాలలను డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి సందర్శించారు. నిద్దంలో ప్రైమరీ పాఠశాల, మండల కేంద్రంలో కెజిబివి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థుల పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. పాఠశాల విద్య విధానాలపై, మధ్యాహ్నం భోజనం పథకాలపై సంతృప్తి చెందారు. అనంతరం ఎంఆర్‌సిలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు అరసాడ రవి, ఎం. శ్రీనివాసరావు, మజ్జి మదన్ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాపాక, తోలాపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా ఉపవిద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల డైరీ, పాఠ్యప్రణాళికలను, ఎండిఎం రికార్డులను ఆమె పరిశీలించారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి

డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ జె.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం కోర్టు పరిధిలోని న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం పదిగంటలకు కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకునే క్రమంలో సంబంధిత కక్షిదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులను కక్షిదారులకు వివరించాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: డిసెంబర్ 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, ఆరవ అదనపు జిల్లా జడ్జి కిషోర్ బాబు, ఇచ్ఛాపురం

సోంపేట : మాట్లాడుతున్న జడ్జి కిషోర్‌బాబు

జూనియర్ సివిల్ జడ్జ్ పరేష్ కుమార్ కోరారు. స్థానిక కోర్టు వద్ద పలాస డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, సోంపేట సిఐ మంగరాజుతో పాటు ఐదు మండలాలకు చెందిన ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించదగ్గ కేసులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న త్రిలోచనరావు

20న రైతు సదస్సు

పలాస: ఈనెల 20న హరిపురం, బాలిగాం జంక్షన్‌లో నరేష్ ఫంక్షన్ హాల్‌లో జరుగు రైతు సదస్సును విజయవంతం చేయాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ సభ్యులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనారావు, బొడ్డు సింహాద్రి, ఎం.ధర్మారావు, గొర్లి చలపతిరావు కోరారు. మండలం బొడ్డపాడులో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ పాలక ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయే తప్ప రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. పంటల కోసం పెట్టిన పెట్టుబడులు రాక వ్యాపారులు వద్ద చేసిన అప్పులు తీర్చలేక వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన నీటి వనరు లేక వ్యవసాయ భూములు బీడు భూములుగా మారిపోతున్నాయని వాపోయారు. వంశధార ఎడమ కాలువ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్‌తో జరుగుతున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

భారత్ బిజినెస్ నెట్‌వర్క్ నూతన ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం భారత్ బిజినెస్ నెట్‌వర్క్ అవని (బిబిఎన్) పేరుతో నూతన సంస్థను ఆవిష్కరించినట్టు సంస్థ సభ్యులు సంతోష్ దూసి తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు శ్రీధర్ కాకర్ల, రాధాకృష్ణ విష్ణుమొలకల నేతృత్వాన ప్రారంభించిన ఈసంస్థలో భాగస్వాములుగా చేరిన ప్రతిఒక్కరు వ్యాపారంలో మెళకువలు నేర్చుకోవాలని వ్యవస్థాపకులు సూచించారు. సంస్థ ద్వారా సభ్యులు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వీలుగా సూచనలు చేశారు. పెట్టుబడి, తక్కువ పెట్టుబడి, వ్యాపార లావాదేవీలు, చిన్నతరహా వ్యాపారాలు తదితర అంశాలపై తమ అనుభవాలను వ్యాపారులు తెలిపారు.

మాట్లాడుతున్న సంతోష్

మునగాకులో అనేక పోషకాలు

ఇచ్ఛాపురం : గర్భిణులకు నిర్వహిస్తున్న సీమంతాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మునగాకు వలన అనేక పోషకాలు లభిస్తాయని మున్సిపల్ కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ అన్నారు. శుక్రవారం బెల్లుపడ కాలనీ, బృందావన్ హడ్కోకాలనీ అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునగ ఆకు వలన కలిగే లాభాలను మహిళలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత, వార్డు ఇన్‌ఛార్జి సంతోష్, ఎస్.శేఖర్, మహిళా పోలీస్ నందిని, అంగన్వాడీ కార్యకర్త లలిత తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలం కేంద్రంలోని గరికిపాలెం అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ మంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త కె.రూపసుధ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

అలాగే మునగ ఆకు ప్రయోజనాల కోసం వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, గర్భిణీలు, బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని దూసి అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పంచాది లతాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు టి. తులసీ రావు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక సచివాలయం-1లో మహిళలు, తల్లులు, గర్భిణీలు, బాలింతలు మునగ ఆకు వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ టి.విమలారాణి, సూపర్‌వైజర్ జి.అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా కార్యదర్శి పాల్గొన్నారు.

ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న కార్యకర్త లతాదేవి

మలేరియా, డెంగీపై అవగాహన కరువు

ప్రజాశక్తి- రణస్థలం

ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న మలేరియా, డెంగీ నివారణపై ప్రజలకు అవగాహన కరువైంది. సీజనల్ వ్యాధుల్లో ముఖ్యంగా వర్షాకాలంలో విజృంభిస్తున్న డెంగీ, మలేరియా వంటి రోగాల బారిన పడకుండా ఉండే విధంగా దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ఆరోగ్యశాఖ అధికారులు, మలేరియా ఇన్‌స్పెక్టర్లు, మలేరియా సూపర్‌వైజర్లు మలేరియా, డెంగీ దోమలు ఏవిధంగా వృద్ధి చెందుతాయో కనీసం అవగాహన సదస్సులు నిర్వహించకుండా ప్రజల ఆరోగ్యం గాలికి వదిలేస్తున్నారు. తరచూ వర్షాలు కురుస్తుండడం వలన మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందడానికి కారణ మవుతున్నాయి. వీటిపై ప్రజలను జాగృతం చేసే దిశగా ఆరోగ్యశాఖ అధికారులు మిన్నకుంటున్నారు. డెంగీ, మలేరియా నివారణపై వేపాకుల పొగ, దోమలకు సెగ, డ్రైడే ఫ్రైడే అంటూ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించాలి. నీరు నిల్వ లేకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతోనే దోమలను నివారించవచ్చని, దోమలు ఎందువలన, ఏ విధంగా వృద్ధి చెందుతాయో చూపిస్తూ ప్రజలకు వివరించాలి. దోమలను నివారించటం వలన తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అవగాహన కల్పించాలి. ఇంట్లో నిరుపయోగంగా ఉన్న, ఉపయోగంలో ఉన్న బాటిల్స్, టైర్లు, మొక్కల కుండీల్లో, ఫ్రిడ్జ్ వెనుక, కొన్ని వస్తువుల్లో నీరు నిల్వ ఉండటంతో లార్వా తయారై మలేరియా, డెంగీ దోమలు వృద్ధి చెందుతాయని, ప్రజలు వీటిని గుర్తించి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, అలాగే ప్రతి శుక్రవారం ట్యాంకులు, డ్రమ్ములను శుభ్రపరిచి డ్రై డే ఫ్రైడేగా చూసుకోవాలని తగు సూచనలు చేసేవారు లేరు. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు దోమతెరలు ఉపయోగించి అప్రమత్తంగా ఉండాలని అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలి. ప్రస్తుతం అధికారులు ఆదిశగా అవగాహన కల్పించకపోవడంతో పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రజల ఆరోగ్యంపై డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక రోగాల నుంచి రక్షించుకొనేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అనునిత్యం అవస్థలమయం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని నారాయణపురం ఎడమ కాలువపై ఉన్న వంతెనను శుక్రవారం ఇసుక లారీ ఢీ కొట్టింది. అయితే ఇసుక లోడుతో ఉన్న లారీ వంతెనను ఢీ కొట్టి కాలువలో పడిపోయే పరిస్థితి వచ్చింది. లారీని డ్రైవర్ చాకచక్యంతో నిలబెట్టాడు. వంతెనకు అడ్డంగా లారీ నిలిచిపోవడంతో సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చుట్టుపక్కల మండలాల ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు.

చోద్యం చూస్తున్న అధికారులు

నారాయణపురం ఎడమ కాలువపై ఉన్న వంతెనను పలుమార్లు ఇసుక లారీలు ఢీకొట్టడంతో వంతెన దాదాపు శిథిలవస్థకు చేరుకుంది. మండలంలోని కాఖంద్యాం ఇసుక ర్యాంపు నుంచి ప్రతిరోజు పగలు, రాత్రి లేకుండా పదుల సంఖ్యలో భారీ లారీలు ఇసుక లోడుతో ఈ వంతెనపై ప్రయాణించినప్పటికీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని మండల ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా అక్రమ ఇసుక రవాణాను అరికట్టాల్సిన పోలీస్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పట్టించుకోకపోవడం వలన ఇసుక వ్యాపారుల ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అధికలోడ్లతో అనునిత్యం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న లారీలను అడ్డుకోవాలని కోరారు. ముఖ్యంగా సంతకవిటి, రాజాం, బూర్జ, పాలకొండ, శ్రీకాకుళం, ఆమదాలవలస మండలాల ప్రజలు అనునిత్యం ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నరన్నారు. ప్రస్తుతం ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వంతెనను ఢీకొన్న లారీ

మురుగునీటిలో మృతదేహం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక మండాపోలం కాలనీ 4వ లైన్‌లో ఖాళీగా ఉన్న పునాదుల్లో ఉన్న మురుగునీటిలో శుక్రవారం ఒక వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక భూలోకమాత వీధికి చెందిన బాదా రిషికేశ్ (42) అనే వ్యక్తిగా స్థానికులు పరిశీలించి గుర్తించారు. అవివాహితుడైన రిషికేశ్ స్థానికంగా పువ్వులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పునాదుల్లో మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి శవపంచనామా నిర్వహించి జిల్లా ఆస్పత్రికి తరలించారు రుషికేశ్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌టిఆర్ కాలనీలో చోరీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేజర్ పంచాయతీలోని ఎన్‌టిఆర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికంగా నివాసం ఉంటున్న యమున అనే మహిళ టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్యోగ నిమిత్తం రాత్రి డ్యూటీకి వెళ్లగా గమనించిన దొంగలు ఆమె ఇంటిని కొల్లగొట్టారు. ఇంట్లో ఉన్న 15 తులాల బంగారంతో పాటు, వెండి సామాన్లు, రూ. 60 వేలు నగదు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసుల ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీసొత్తు, నిందితులతో సిఐ సత్యనారాయణ, సిబ్బంది

చోరీసొత్తు రికవరీ

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని తిరుమల బంగారం దుకాణంలో ఈనెల 9న వెండి వస్తువుల చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను శుక్రవారం అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసినట్లు సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి.సత్యనారాయణలు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు విశాఖ పట్నంలోని అల్లిపురానికి చెందిన షేక్‌భాను, దేశిరాజు ధనలక్ష్మి అనే మహిళలు ఈనెల 9న పొందూరు మండల కేంద్రంలోని తిరుమల బంగారం దుకాణంలో కొనుగోలుకు వచ్చారు. వెండి వస్తువులు కొనుగోలు చేస్తున్నట్లు నమ్మించి 700 గ్రాముల (సుమారు 60 తులాలు) వెండి పట్టీలను చోరీ చేశారు. సిసి కెమెరాలో మహిళలు చోరీ చేసినట్లు గుర్తించిన దుకాణం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సిసి పుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడిన మహిళలను గుర్తించి అరెస్టు చేసి, సొత్తును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వారిని వేగంగా పట్టుకోవడంపై ఎస్ఐని, సిబ్బందిని అభినందించారు.

అధికారుల విచారణకు హాజరైన సర్పంచ్ ప్రతినిధి

ఏకపక్షంగా విచారణ చేస్తే ఎలా?

ఆమదాలవలస: మండలంలోని కూన జమ్మన్నపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన విచారణ ఏకపక్షంగా నిర్వహించారని టిడిపికి చెందిన కె. అమ్మి నాయుడు, జి.రవికుమార్‌లు అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన అంగన్వాడీ కేంద్రం ఆయా నియామ కంలో ఐసిడిఎస్ అధికారులు నిబంధనలు పాటించలేదని ఫిర్యాదు చేయడం జరిగిందని, ఆయా పని తీరుతో పాటు ఉద్యోగం పొందుటకు సమర్పించిన ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టిన బూర్జ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఫిర్యాదు దారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కేవలం వైసిపికి చెందిన కొంతమంది వ్యక్తులతో ఏకపక్షంగా విచారణ జరపడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఐసిడిఎస్ అధికారులతో పాటు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసి కోర్టును ఆశ్రయిస్తామని వారు తెలిపారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న గోవిందరావు

సాంస్కృతిక శిక్షణలో గోవిందరావు

లావేరు: దేశ రాజధాని న్యూఢిల్లీలోని కేంద్ర సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ దేశంలోని అన్ని రాష్ట్రాల ఉపాధ్యాయులకు నూతన విద్యా విధానం 2020లో సమగ్ర విద్య విధానంపై ఐదు రోజుల శిక్షణలో మండలం బుడుమూరు జెడ్‌పి పాఠశాల ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు శిక్షణలో పాల్గొన్నారు. భారతీయ సంగీతం, నృత్యం, హస్తకళలు, సాంప్రదాయ కథల ద్వారా విద్యార్థులకు బోధన చేయాలని శిక్షణ ఇచ్చినట్టు గోవిందరావు తెలిపారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ?

కవిటి: కుల ధ్రువీకరణ పత్రాల కోసం శాంతి యుతంగా దీక్ష చేస్తున్న తాము ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని బెంతు ఒరియాలు ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 297వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా శుక్రవారం దీక్షలో బల్లిపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ యువత ఉద్యోగాలు కోల్పోతోందని, పిల్లలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని వాపోయారు. ఈ సందర్భంగా కవిటి మాజీ సర్పంచ్ ఆరింగి మధు దీక్షలో పాల్గొని తన సంఘీభావం తెలిపారు. సుమన్ బిసాయి, మార్కండేయ దొలై పాల్గొన్నారు.

సంఘీభావం ప్రకటిస్తున్న మాజీ సర్పంచ్ మధు

నిరసన వ్యక్తం చేస్తున్న ఏజెంట్లు

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- సోంపేట

న్యాయమైన ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం స్థానిక కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల ఎల్ఐసి యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆల్ ఇండియా ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ పిలుపుమేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పాత పద్ధతిలో పాలసీలు సేకరించేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వసంతరావు, పద్మలోచన, రామ్మూర్తి, వాసుదేవరావు, వెంకట్రావు, శ్రీనివాసరావు, మురళి, సూర్యం, ఆనంద్ పాల్గొన్నారు.

పనులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

విద్యుత్ లైను మరమ్మతులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యుత్ సబ్ స్టేషను పరిధిలో 11 కెవి బెండి ఫీడర్లో శుక్రవారం విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను విద్యుత్ శాఖ ఎడి కృష్ణమూర్తి, ఎఇఇ జి.వి. రమణమూర్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా సమస్యలు గుర్తించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. బెండి నుంచి కొండపూరు మధ్యలో ఉన్న విద్యుత్ లైన్, స్తంభాలు సరిచేయడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్నట్లు తెలిపారు.

సమస్యల పోరాటానికి సిద్ధం కావాలి

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతా యుతమైన ప్రతిపక్షంగా పోరాటాలకు సిద్ధం కావాలని వైసిపి నాయకులు, కార్యకర్తలకు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపు, ఓటములు ప్రజాస్వామ్యంలో సహజమని పార్టీ అధికారంలో ఉన్నప్పటి కంటే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మనపై గురుతర బాధ్యత ఎక్కువగా ఉంటుందని అన్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతిఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం ఉండాలని, రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ క్యాడర్, గ్రామ వార్డు స్థాయిలో ఐక్యతతో పనిచేయాలని కోరారు. మంత్రి పదవిని ఆశించి భంగపడిన శాసనసభ్యుడు మతి భ్రమించి మాట్లాడుతున్నాడని, అధికారం ఎవరికి శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, బొడ్డేపల్లి నారాయణరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, అల్లంశెట్టి ఉమా మహేశ్వరరావు, చల్లా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ స్పీకర్ సీతారాం

కావాలనే ఘర్షణకు ప్రేరేపించారు

వైసిపి నాయకులు కృష్ణచైతన్య

ప్రజాశక్తి- పోలాకి

ఇటీవల మండలం వనవిష్ణుపురం గ్రామంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య గ్రామదేవత ఉత్సవాలు సందర్భంగా చెలరేగిన ఘర్షణల్లో ఒకరు చనిపోగా, మరికొందరు గాయపడిన విషయం తెలిసిందే. కాగా పోలీసులు వైసిపి సానుభూతిపరులపై కేసు నమోదు చేయగా నిందితులను నరసన్నపేట సబ్ జైలులో ఉన్నారు. ఈ విషయమై పోలాకి జెడ్పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య శుక్రవారం సబ్జైలులో ఉన్న నిందితులను ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన ఘర్షణను యువ నాయకులకు వివరించారు. టిడిపి నాయకులు కావాలనే రెచ్చగొట్టి ఘర్షణకు ప్రేరేపించారని, ముందుగా టిడిపి నాయకులే వైసిపి కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని, తమకు తీవ్రంగా గాయాలయ్యాయని వారు తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ బైరాగినాయుడు, వైస్ ఎంపిపి కలగదుండ తాతారావు, పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, బొద్దాం సర్పంచ్ బెండి శ్రీనివాస్ తదితరులున్నారు.

నిందితులను కలిసి వస్తున్న కృష్ణచైతన్య, వైసిపి నాయకులు

సిఐ కలిసిన కృష్ణచైతన్య

పోలాకి మండలం వన విష్ణుపురంలో శాంతి భద్రతలు నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య నరసన్న పేట సిఐ జి.శ్రీనివాసరావును కోరారు. గ్రామంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, ఇప్పటివరకు మహిళలు గ్రామంలో తిరగలేకపోతున్నారని, యథేచ్ఛగా మేకలు, గొర్రెలు, పశువులు దొంగిలించ బడు తున్నాయని సిఐకు నాయకులు తెలియజేశారు. ఈ విషయం ంపై స్పందించి దొంగతనాలపై చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు మౌన ర్యాలీ

పోస్టర్ను ఆవిష్కరిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ, రోజెస్, మూమెంట్ గ్లోబల్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా శనివారం ఉదయం ఏడు గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వాక్ఫర్ ఫ్రీడమ్ మానవ అక్రమ రవాణాను వ్యతిరేకిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షులు బి.వి.రవిశంకర్ తెలిపారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్ను జిల్లా ఉపాధికల్పనా శాఖాధికారి కొత్తలంక సుధ, వికలాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత, రోజెస్ సంస్థ అధ్యక్షుడు జి.వి.నాగభూషణరావుతో కలిసి ఆవిష్కరించారు. నాగరిక సమాజంలో మానవ అక్రమ రవాణా అనాగరిక చర్యని అభివర్ణించారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, గుడ్ల జగ్గారావు, డాక్టర్ ఎం.వాసుదేవ్, జి. వాసు దేవరావు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం పరిశీలన

ప్రజాశక్తి- నందిగాం

మండలానికి కేటాయించిన 108 వాహనాన్ని మెయింటినెన్స్ 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ జి.జగన్ శుక్రవారం పరిశీలించారు. వాహనంలో రికార్డు నిర్వహణ, మందుల పంపిణీని పరిశీలించి వాహన పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు ఇఎంటి రాము, పైలెట్ కుమారస్వామి ఉన్నారు.

పలాస: మండల కేంద్రంలో 108 డివిజన్ సేవలను 108 జిల్లా ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు పరిశీలించారు. వాహన నిర్వహణ తీరు, పరికరాల పనితీరుతో పాటు అత్యవసర మందుల నిర్వహణ, రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. కార్యక్రమంలో 108 డివిజన్ సిబ్బంది తారకేశ్వరరావు, మోహనరావు, ఎస్.వెంకట్రావు, సత్యం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

108 వాహనాన్ని పరిశీలిస్తున్న జగన్

విఒఎలకు శిక్షణ

మెళియాపుట్టి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం విఒఎలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం 15 ఏళ్ళ నుంచి 60 ఏళ్లలోపు వారికి అక్షరాభ్యాసం నేర్పించాలని ఉల్లాసం ప్రోగ్రాం ప్రవేశపెట్టిందని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎపిఎం గోవిందమ్మ తెలిపారు. పదిమంది డ్వాక్రా మహిళలకు ఒక వాలంటీర్ చొప్పున మండలంలోని 1,118 మందికి 111 మంది వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. సర్వే చేయడానికి ఫార్మెట్లు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరన్నాయుడు, సిఎఫ్లు, విఒఎలు పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, విఒఎలతో ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఎపిఎం రవణమ్మ సమీక్ష జరిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు వేయించాలి

కోటబొమ్మాళి: నట్టల నివారణ మందులను గొర్రెలు, మేకల పెంపకందారులు తమ పశువులకు వేయించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలం పాకివలస, వాండ్రాడ్, పెద్దబమ్మిడి, కొత్తపల్లి గ్రామాల్లో సుమారు 2,500 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ మందులు వాడటం వలన జీవాల బరువు పెరుగుతాయని, దీంతో ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశు సంవర్థక సహాయకులు ముకుందరావు, బలరాం, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులను వేస్తున్న పశువైద్య సిబ్బంది

విచారణ చేపడుతున్న తహశీల్దార్

రోడ్డు నిర్మాణం ఫిర్యాదుపై విచారణ

పొందూరు: మండలం గోకర్ణపల్లిలో సచివాలయానికి చెరువు గర్భంలో రోడ్డు నిర్మాణం చేపట్టడంపై గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు గ్రీవెన్స్లో ఇచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. చెరువు గర్భాన్ని పూడ్చి రహదారి నిర్మాణం చేపట్టినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంపై విచారణ జరిపామని, దీనిపై నివేదికను జిల్లా కలెక్టర్కు అందజేయనున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు, గ్రామస్తులు

కృష్ణమూర్తి నాయుడు వర్ధంతి

మెళియాపుట్టి: మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి ఎన్ని కృష్ణమూర్తి నాయుడు వర్ధంతి పెద్ద పద్మాపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, మాజీ ఎంపిటిసి ఉర్లాన రుక్మందర్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఉర్లాన వసంత్, గ్రామస్తులు కృష్ణమూర్తి నాయుడు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృష్ణమూర్తినాయుడు చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ మాలతి ఢిల్లేశ్వరరావు, ఘనశ్యామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్

విద్యార్థులకు బహుమతులు

రణస్థలం: మండలం లంకపేట కెజిబివి పాఠశాలలో శుక్రవారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్లో భాగంగా హెచ్పి గ్యాస్ శ్రీదేవి ప్రసాద్ ఎంటర్ ప్రైజెస్ మేనేజర్ డబ్బీరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయడంతో పాటు విజిలెన్స్ అవేర్నెస్పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మశకాపురంలో పొలంబడి

ఇచ్ఛాపురం: మండల వ్యవసాయ శాఖాధికారి భార్గవి ఆధ్వర్యంలో మసకపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. దోమపోటును ఎలా గుర్తించాలి, ఎటువంటి యాజమాన్య పద్ధతులు పాటించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, అగ్రికల్చర్ అసిస్టెంట్, నేచురల్ ఫార్మింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ భార్గవి